ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల

జిల్లా వార్తలు

బుధవారం 15 మే 2024





తీర్పుకు తాళం..!

నంద్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల సమరం సోమవారంతో ముగిసింది. నేతల భవితవ్యానికి తాళం పడింది. రాత్రి పొద్దు పోయే వరకు పోలింగ్ సాగింది. ఎన్నికల రోజు సాయంత్రం 6 గంటలకు కూడా ఓటర్లు ఓటేసేందుకు రావడంతో ఎన్నికల అధికారులు వారికి టోకెన్లు ఇచ్చి ఓటింగ్ వేయించారు. ఇలా దాదాపు 500కి పైగా పోలింగ్ సెంటర్లలో ఈ పరిస్థితి సాగింది. దీంతో పోలింగ్ ప్రక్రియ చాలా ఆలస్యంగా ముగిసింది. ఇక పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను అధికారుల జాగ్రత్తగా పరిశీలించి సీలు వేశారు. ఆ తర్వాత వాటిని నంద్యాల శివారులోని శాంతిరాం, ఆర్జీఎం కళాశాలలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 82.09 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 13.89 లక్షల 89 వేల 307 మంది ఉండగా, 13 లక్షల 89 వేల 307 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అత్యధికంగా నందికొట్కూరు (84.79)లో పోలింగ్ జరగ్గా, అత్యల్పంగా నంద్యాల (74.90)లో జరిగింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు తీర్పును వచ్చే నెల 4వ తేదీన తెరవనున్నారు. ఆ రోజు ఏ నేత భవితవ్యం ఏమిటన్నది తేలిపోతుంది.



ఈవీఎంలను భద్రపరుస్తున్న అధికారులు

- నేతల భవితవ్యం ఈవీఎంలలో భద్రం
- రాత్రి పొద్దు పోయే వరకు జరిగిన పోలింగ్
- జిల్లా వ్యాప్తంగా 82.09 శాతం నమోదు
- స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు
- జోరందుకున్న బెట్టింగ్‌లు

గతంలో అలా.. ప్రస్తుతం ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో ఎన్నికల పోలింగ్ చాలా తక్కువగా జరుగుతుంది. ముఖ్యంగా యువత, ఉన్నతస్థాయి వర్గాల వారు ఓటేయడానికి పెద్దగా ఆసక్తి చూపరు. కానీ జిల్లాలో మాత్రం ఆ పరిస్థితులు మారుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. గత రెండు ఎన్నికల పోలింగ్ శాతాన్ని, ప్రస్తుత పోలింగ్ శాతాన్ని పరిశీలించి చూస్తే ఈ విషయం అర్థమవుతోంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 2014 ఎన్నికల్లో 76.75 శాతం ఉండగా 2019 నాటికి పోలింగ్ శాతం 82.51కి పెరిగింది. ఇక ప్రస్తుత ఎన్నికల్లో కూడా కాస్త అటూ ఇటుగా ఇదే స్థాయిలో పోలింగ్ నమోందైంది.

బెట్టింగ్ బంగార్రాజులు..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐపీఎల్ బెట్టింగ్ నడుస్తోంది. గెలిచే టీమును బట్టి పందేలు సాగుతుంటాయి. ఈ ఐపీఎల్ బెట్టింగ్ ప్రతి సంవత్సరం నడుస్తుంది. కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎల్ బెట్టింగ్‌ను మించిన హంగామా నడుస్తోంది. నిన్నటి సోమవారం జరిగిన ఎన్నికల్లో గెలుస్తుందనే దానిపైన అందరిలో ఉత్కంఠ నెలకొంది. క్రికెట్‌లో బంతికి బంతికి.. ఓవర్ ఓవర్‌కు బెట్టింగ్ నడిస్తే ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి.. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? రాష్ట్రం మొత్తంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్న బెట్టింగ్ జోరుగా నడుస్తోందన్న ప్రచారం సాగుతోంది. జిల్లాలో ముఖ్యంగా ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, పాణ్యం నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యంపై భారీగా బెట్టింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో వైసీపీకి ఎన్ని సీట్లు? టీడీపీకి ఎన్ని సీట్లు? అనే దానిపైన కూడా ఎక్కువగానే పందేలు సాగుతున్నట్లు సమాచారం. సీఎం జిల్లాకు చెందిన కొంతమంది ఒకటికి పది లెక్కన బెట్టింగ్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు సంబంధించిన ఎన్నికలు మహా గందరగోళంగా ఉన్నాయని, అనవసర బెట్టింగ్‌లు కాస్తే కొంపలు ఆర్పుకోవడం తప్పించి ఏమీ ఉండదని, సాధ్యమైనంత మేర ఈ బెట్టింగ్‌లకు దూరంగా ఉంటే బావుంటుందన్న అభిప్రాయాన్ని కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా జిల్లాలో ఐపీఎల్ కంటే ఎన్నికలపైనే విపరీతంగా బెట్టింగ్ నడుస్తోందని, రెండు మూడు రోజులు ఆగితే ఇది మరింత ముదిరే అవకాశముందన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి.

బూత్‌ల వారీ ఓటింగ్ సరళిపై ఆరా..

దాదాపు రెండు నెలల క్రితం ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. అప్పటి నుంచి జిల్లాలోని ఆయా పార్టీ నేతలంతా ప్రచారంలో ఉన్నారు. ఎన్నికల్లో పాటించాల్సిన ఎత్తులు ఏమిటి? ఎక్కడ ఏ సామాజిక వర్గాన్ని బుజ్జగిస్తే ఓట్లు రాలతాయి? జంపింగ్ జపాంగ్‌లను కాపాడుకుంటూ ఓటు బ్యాంకును భద్రంగా చూసుకునేదెలా? అసలు తమ బలాబలాలు ఏమిటి? దానికి తోడు ప్రచారం ఎలా సాగించాలి? అన్న విషయంపై రాత్రింబవళ్లు తెగ హైరానా పడ్డారు. ఇదంతా ఒక ఎత్తైతే పోలింగ్ రోజున తమ కార్యకర్తలు ఏ మేరకు పని చేశారనే టెన్షన్ నాయకుల్లో పట్టుకుంది. దీంతో ఓటింగ్ ముగిసిన అనంతరం మంగళవారం రోజున నేతలంతా తాము అనుసరించిన వ్యూహాలన్నీ సరిగా పని చేశాయా? లేక ఎక్కడైనా బెడిసి కొట్టిందా? అన్నదానిపై ఆరా తీస్తున్నారు. దీంతో జిల్లాలోని ఆయా పార్టీ నాయకులు ఓటింగ్ సరళిపైన ఆరా తీయడం మొదలుపెట్టారు. బూత్‌ల వారీగా తమకు ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉంది? ప్రత్యర్థి ఏ స్థాయి ప్రభావం చూపించారు? అనే దానిపైనా తమ పోలింగ్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలతో చర్చలు జరిపారు.

20 రోజులు తప్పదు మరి..

గత ఎన్నికల్లో జిల్లాకు సంబంధించిన ఫలితాల్లో వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది. గత ఎన్నికల్లో 82.51 శాతం ఓటింగ్ జరిగింది. ఈసారి కూడా అదే స్థాయిలో జరిగింది. ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్చిన చాన్స్ అయిపోయింది కాబట్టి ప్రజలు తమకే ఓటేశారని, విజయం తథ్యమని టీడీపీ నాయకులు ధీమాతో ఉన్నారు. ఐదేళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాం కాబట్టి ఓటర్లంతా తమకే జై కొట్టారని, అందుకే గత ఎన్నికల మాదిరే ఈ సారి కూడా ఓటింగ్ జరిగిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. అయితే ఓటర్లు మాత్రం తమ ఓటును ఎవరికి వేశాడన్నది ఏమాత్రం బయట పడనివ్వకుండా గంభనంగా ఉన్నారు. ఆయా పార్టీలు తమ విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నా.. ఓటరు మనసులో ఏముందో కనిపెట్టలేకపోవడంతో టెన్షన్ టెన్షన్‌గా గడుపుతున్నారు. ఫలితాలకు దాదాపు 20 రోజుల వ్యవధి ఉండటంతో అన్ని రోజులు ఈ టెన్షన్‌ను ఎలా భరించాలని అభ్యర్థులు పేర్కొంటున్నట్టు తెలుస్తోంది.



సంవత్సరం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం
2014	ఆళ్లగడ్డ	బనగానపల్లె	డోన్	నందికొట్కూరు	నంద్యాల	శ్రీశైలం
మొత్తం ఓట్లు	189401	256776	197541	189233	281799	187066
పోలైన ఓట్లు	154118	166652	129691	166301	212004	159907
శాతం	81.37	64.9	65.65	87.88	75.23	85.48
సంవత్సరం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం
2019	ఆళ్లగడ్డ	బనగానపల్లె	డోన్	నందికొట్కూరు	నంద్యాల	శ్రీశైలం
మొత్తం ఓట్లు	221164	233754	220035	197720	257029	185218
పోలైన ఓట్లు	187775	195097	174597	172720	197517	154007
శాతం	84.9	83.46	79.35	87.36	76.85	83.15
సంవత్సరం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం	నియోజకవర్గం
2024	ఆళ్లగడ్డ	బనగానపల్లె	డోన్	నందికొట్కూరు	నంద్యాల	శ్రీశైలం
మొత్తం ఓట్లు	232676	241179	227351	218047	273935	196116
పోలైన ఓట్లు	195582	203839	188169	184892	205190	162760
శాతం	84.06	84.52	82.77	84.79	74.90	82.99

మంత్రి బుగ్గనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బేతంచెర్ల, మే 14: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పట్టణంలో మంత్రి బుగ్గన ఇంటి సమీపంలో రిటైర్డు అడిషినల్ ఎస్పీ పీఎస్ బాబును కులం పేరుతో తిట్టిన మంత్రి బుగ్గన, ఆయన అనుచరులు చలంరెడ్డి, నాగరాజు, నాగేశ్వరరావుతోపాటు మరో 30 మంది వైసీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ మంగళవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆయన అనుచరులు పల్లెలు తిరుగుతూ ఇంటికి రాగా వారి వెనుకాల వెంబడిస్తూ వస్తున్న రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ పీఎస్ బాబు డ్రైవర్‌లను కులం పేరుతో దూషించారని పీఎస్ బాబు ఫిర్యాదు చేశారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే మంత్రి బుగ్గన తన ఇంట్లో పని చేసే జయలచ్చమ్మ అనే మహిళతో పీఎస్ బాబు, ఆయన డ్రైవర్‌పైన కూడా కేసు నమోదు చేయించారు. పీఎస్ బాబు డ్రైవర్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ తన మీదకు తీసుకొచ్చాడని జయలచ్చమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పీఎస్ బాబుతోపాటు ఆయన డ్రైవర్‌పై కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

ఆత్మకూరు రూరల్, మే 14: నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామ శివార్లలో పిడుగు పడి తెలుగు పెద్ద ఆంజనేయులు(35) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు..



మృతి చెందిన ఆంజనేయులు

ఆత్మకూరు మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన పెద్ద ఆంజనేయులు వెంకటాపురం గ్రామ శివార్లలోని పొలాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. ఆ ప్రాంతంలో పిడుగు పడడంతో పెద్ద ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం పనులు చేసుకుంటున్న గ్రామస్థులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.. మృతునికి భార్యతో పాటు ఓ కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు(అర్బన్), మే 14: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో 3374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాలు టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బీఈడీ సెమిస్టర్ కూడా..

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 16 నుంచి బీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ 1, 3, 4, సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

వైసీపీ నాయకుడి అరాచకం

- టీడీపీ నాయకుడి ఇంటి వద్దకు వెళ్లి బెదిరింపులు
- మరో టీడీపీ కార్యకర్తపై దాడి
- పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

నందికొట్కూరు, పగిడ్యాల, మే 14: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో వైసీపీ నాయకుడి అరాచకాలు మితిమీరాయి. ఇటీవల గంగి రమణ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరడంతో జీర్ణించుకోలేని వైసీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు అతనిపై కక్ష పెంచుకున్నారు. మంగళవారం ఉదయం బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రధాన అనుచరుడు రమేష్‌నాయుడు తమ అనుచర వర్గంతో టీడీపీ నాయకుడు గంగి రమణ ఇంటికి చేరుకుని బెదిరింపులకు గురి చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్తూ సంతమార్కెట్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న టీడీపీ కార్యకర్త రాముడుపై దాడికి పాల్పడ్డారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు ఉండడంతో వారిని ఇక్కడి నుంచి వెళ్లి పోవాలంటూ నిలదీశారు. విషయాన్ని మనసులో పెట్టుకున్న రమేష్ నాయుడు, స్వాములు, నరసింహులుతో పాటు మరికొంత మంది కలిసి ఒంటరిగా ఉన్న రాముడిపై దాడి చేశారు. చొక్కా, బనియన్ చించి వేశారని రాముడు తెలిపారు. తనను కిందకు తోసి వేయడంతో గమనించిన టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుతోపాటు మరికొంత మంది నాయకులు, మహిళలు అక్కడికి చేరుకొని వైసీపీ నాయకులను ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వెళ్లిపో యారు. విషయాన్ని పోలీసులకు తెలియ జేయడంతో ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణలు గ్రామానికి చేరుకున్నారు.

న్యాయం చేయాలంటూ బైఠాయింపు

గత కొంత కాలంగా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో వైసీపీ నాయకుడు రమేష్ నాయుడు గొడవలకు పాల్పడుతూ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నారని మహిళలు పోలీసు వాహనాల ఎదుట బైఠాయించి పోలీసులను వేడుకున్నారు. వైసీపీ నాయకులు పలువురిపై దాడులకు పాల్పడుతున్నా వారిపై మాత్రం సాధారణ కేసులు నమోదు చేస్తూ... బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం న్యాయమా అంటూ నిలదీశారు. గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నా ఇన్ని రోజులు ఓపికతో ఉన్నామని, ఇంకా ఎన్నాళ్లు భయపడుతూ బతకాలంటూ పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు ఘర్షణకు పాల్పడిన వారిని ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరగా కొద్ది సేపటికి సుమారు 200 మంది గ్రామస్థులు వాహనాల్లో ముచ్చుమర్రి స్టేషన్‌కు తరలి వెళ్లారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ఇరువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనంతరం టీడీపీ నాయకుడు రాముడు ఫిర్యాదు మేరకు రమేష్ నాయుడు, నరసింహ, స్వాములు, కురువ మల్లయ్యలపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్.ఐ జయశేఖర్ తెలిపారు.



పోలీసుల వాహనాల ఎదుట బైఠాయించిన మహిళలు, గ్రామస్తులు

వైసీపీ కార్యకర్తకు గాయాలు

ఇరు వర్గాల మధ్య జరిగిన గర్షణలో వైసీపీ కార్యకర్త విజయుడుకు కూడా గాయాలయ్యాయి. గాయపడిన విజయుడును నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల నిర్లక్ష్యం

వైసీపీ నాయకుడు రమేష్ నాయుడు గ్రామంలో టీడీపీ నాయకులపై వారం రోజుల నుంచి బెదిరింపులకు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. దీంతో సుబ్బారెడ్డి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చిన గంగి హరిప్రసాద్ రావడంతో వైసీపీ నాయకులు ఈళలు, కేకలు వేసి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. మంగళవారం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరగడం విశేషం. గతంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గానికి చెందిన రమేష్ నాయుడు, ఎమ్మెల్యేల తోగూరు ఆర్థర్ వర్గానికి చెందిన సగినెల రమణల మధ్య వివాదాలు కొనసాగుతూ వచ్చేవి. ఎన్నికలు ముగిసిన 24 గంటలు గడవకముందే వైసీపీ నాయకుడు రమేష్ నాయుడు అనుచరులు టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.



వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త రాముడు

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లె				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితీ, కల్లూరు (మం.), కర్నూలు -518002.

*షరతులు వర్తిస్తాయి

వైభవంగా గంగాదేవి వార్షిక పుష్కరోత్సవం



కోనేరులో గంగాదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మే 14: మహానంది క్షేత్రంలో గంగాదేవి వార్షిక పుష్కరోత్సవ పూజలను మంగళవారం ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగాదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని మేళతాళలతో రాజగోపురం వద్దకు తీసుకొచ్చి ఉపచారములన్నీ సమర్పించారు. అనంతరం రుద్రగుండం కోనేరులోని పంచపాండవుల మంటపం వద్దకు గంగాదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని తీసుకొచ్చి ఆశీనులు చేశారు. అభిషేకపూజలతోపాటు అలంకార హారతులు ఇచ్చి సంకల్ప స్నానం నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు రుద్రగుండం కోనేరులో గంగాదేవి వార్షిక పుష్కరోత్సవం పురస్కరించుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సుధారాణి దంపతులతోపాటు దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైశాఖ బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై విహరిస్తున్న జ్వాలా నరసింహ స్వామి

ఆళ్లగడ్డ, మే 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వేకువ జామున్నే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహ స్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకించారు. స్వామి వారిని హంస వాహనంపై మాడ వీధుల్లో విహరింపజేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సుధాకర్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలి

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఫిర్యాదు చేస్తున్న మల్లెల రాజశేఖర్, చదువుల సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, మే 14 మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డిని హత్యచేసేందుకు వచ్చిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకుడు మల్లెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మల్లెల రాజశేఖర్‌తో పాటు చదువుల సుధాకర్ రెడ్డి భారీ జనంతో ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో చదువుల సుధాకర్ రెడ్డి పోలింగ్ బూత్ ఏజెంటుగా ఉండటం, ప్రజలు టీడీపీకి ఓట్లు వేయడం జీర్ణించుకోలేని గ్రామ వైసీపీ నాయకులు రాత్రి వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాముగల మహేష్, సోమన్న, ఆవుల పెద్ద మద్దయ్య, నాగార్జున, రవీంద్ర, రహింతుల్లా, వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణ, మనోహర్‌లతో పాటు మరి కొంత మంది సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి కాంపౌండులోకి దూకి హత్య చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. వైసీపీ వాళ్లు కొడవళ్లు, ఇనుపరాడ్లు, బండరాళ్లతో వెళ్లగా, అక్కడే ఉన్న వేణుగోపాల్ రెడ్డితో పాటు మరి కొంత మంది వాళ్లను ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి ఓర్వకల్లు ఎస్‌ఐ రాజారెడ్డి పోలీసు బలగాలతో సుధాకర్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని గూండాలను తరిమికొట్టారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే వైసీపీకి చెందిన వారు ఈ హత్యాయత్నం చేశారని, ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలోని దృశ్యాల ఆధారంగా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని సుధాకరరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హెచ్.కొట్టాలలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకుల దాడులు

మండలంలోని హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోదండరామిరెడ్డి, అతని కుమారుడు విజయనాగిరెడ్డిపై సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తాము ఓటు వేసేందుకు వెళ్లగా.. వైసీపీకి చెందిన వడ్డె ఉమాశంకర్, వడ్డె మహేంద్ర, భూపతి, వడ్డె కిట్టు, వడ్డె వెంకటేశ్వర్లు, వడ్డె మధు, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున కలిసి రాళ్లతో, కర్రలతో దాడులు తమపై దాడి చేశారని ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.


డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు వన్‌టైం నోటిఫికేషన్

1994నుంచి 2014వరకు పాస్‌కాని విద్యార్థులకు అవకాశం

అనంతపురం సెంట్రల్, మే 14: ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఒక్కసారి అవకాశం పేరుతో నోటిఫికేషన్ విడుదల చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 1994-95 నుంచి 2014-15వరకు డిగ్రీలో ఫెయిలయిన విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. జూన్ 14వరకు పరీక్షా ఫీజు చెల్లింపు గడువు విధించామన్నారు. ఫీజు చలానా, నామినల్ రోల్స్‌తోపాటు దరఖాస్తు కాపీలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు జూన్ 18లోపు ఎస్కేయూ పరీక్షల విభాగంలో సమర్పించాలని సూచించారు. రూ.1000 ఫైన్‌తో జూన్ 21వరకు, రూ.3వేల ఫైన్‌తో 28లోపు చెల్లించవచ్చన్నారు. పరీక్షల నిర్వహణ తేదీ ముందురోజు వరకు ఫీజుతోపాటు రూ.5వేల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక సబ్జెక్టుకు రూ.2వేలు, రెండు సబ్జెక్టులకు రూ.3వేలు. మూడు నుంచి ఆపై ఎన్ని సబ్జెక్టులున్నా రూ.4వేల ఫీజును నిర్ధారించామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి తృతీయ సంవత్సరం కళాశాలను వీడిన విద్యార్థులు రూ.3వేల ఫైన్‌తో పరీక్షల ఫీజు కట్టవచ్చు అన్నారు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ చేసిన విద్యార్థులున్నారని, వారందకీ వన్ టైం చాన్స్ పేరుతో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షలు, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఎప్పుడు నిర్వహించేది టైంటేబుల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అనంతపురం కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు రీరీరీ.ఱజూఉజీర్భుటఱజ్జీఽ్ఛచి.జీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఓటర్లు ఎటు మొగ్గారు?

- ప్రధాన పార్టీల నుంచి డబ్బులు తీసుకున్న ఓటర్లు
- ఇస్తే కాదనలేదు.. ఇచ్చినోళ్లకే ఓటేసిందీ లేదు...!
- చాకచక్యంగా వ్యవహరించిన ఓటర్లు



ఆదోని, మే 14: పోలింగ్ ఎలా జరిగింది..? ఓటర్లు ఎటువైపు మొగ్గారు..? మనకు ఓటేశారా... లేదా..?.. ఏ ఊరిలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు పడ్డాయి..? కేటగిరీల వారిగా ఏమైనా ఓట్లు పడ్డాయా..? కులసంఘాల ఓట్లు గంపగుత్తగా పడ్డాయా..? ఏ బూత్‌లో ప్లస్ ఉంది..? ఏ బూత్‌లో మైనస్ ఉంది..? మెజారిటీ ఎంత వస్తుంది..? డబ్బుల ప్రభావం ఏమేరకు ఉటుంది..? గాలి ఎటువైపు వీచింది..? అనే అంశాలపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ముఖ్యనేతలు మంగళవారం రోజంతా ఆరా తీశారు. పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య 20 రోజులు గ్యాప్ ఉండటంతో.. ప్రధాన పార్టీల నేతల పోలింగ్ ట్రెండ్ పై దృష్టి సారించారు. పోల్ మేనేజ్‌మెంట్ ఎలా చేశాం..? చివరి రెండు రోజుల పనితీరు ఎలా ఉంది..? డబ్బుల పంపిణీ పకడ్బందీగా జరిగిందా..? లేదా..? ప్రణాళికలో ఏమైనా లోపాలు ఉన్నాయా..? గ్రామస్థాయిలో ఉన్న లీడర్లు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయకుండా వారే ఉంచుకున్నది ఎవరు? అనేది ఫలితాలు వచ్చాక తెలుస్తుందని ఎవరికి వారు సమీక్షలు నిర్వహించారు. ఏయే పోలింగ్ బూత్‌ల్లో ఏ మేరకు పోలింగ్ జరిగింది..? ఎవరు ఎటువైపు మొగ్గు చూపారు..? పరిస్థితి ఏమిటి..? అంటూ జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులకు ఫోన్లు చేసి ఆరా తీశారు. అదే క్రమంలో ఎగ్జిట్ పోల్స్‌నూ నిశితంగా పరిశీలించారు. మొత్తానికి గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి అధికారంలోకి వస్తామనే అభిప్రాయంతో వైసీపీ ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, తమకు అనుకూల వాతావరణం ఉన్నదని ఎన్డీఏ కూటమి ధీమాతో ఉంది. ఈసారి తమకు సీట్లు పెరుగుతాయని కాంగ్రెస్ కూడా అంటోంది.

డబ్బులు తీసుకున్నా.. నచ్చిన అభ్యర్థికే ఓటు...

ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీ పడి మరీ డబ్బులు పంచిపెట్టారు. ఇరు పార్టీలు అభ్యర్థులు రూ.500 నుంచి 1000 దాకా పంపిణీ చేశారు. గంపగుత్తగా ఓట్లు పడతాయన్న ఆశతో పెద్ద మొత్తంలోనే అందజేశారు. ఎవరు ఎన్ని డబ్బులిచ్చినా.. ఓటర్లు తీసుకున్నారు. ఓటు మాత్రం తమకు నచ్చిన అభ్యర్థికే వేశారు. ఎక్కువ డబ్బులిచ్చిన పార్టీకే ఓటు వేస్తారని భావించగా.. తీరా పోలింగ్ సరళి చూస్తే అలాంటి వాతావరణమే కనిపించలేదు.

అది మన డబ్బే కదా....!



రాజకీయ పార్టీల నేతలు డబ్బులు పంచిన అంశాన్ని ప్రజలు పెద్దగా సీరియస్‌గా తీసుకోవటం లేదు. అధికారంలో ఉండి.. అక్రమంగా డబ్బులు సంపాదించారని, అది కూడా ప్రజల డబ్బే కదా..? ఏమైనా ఇంట్లో నుంచి తెచ్చి పెడుతున్నారా..? అనే అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో డబ్బు తీసుకోవటాన్ని తప్పుగా భావించటంలేదు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం అధికార వైసీపీ అసాధారణ స్థాయిలో ఖర్చు పెట్టింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి కూడా వైసీపీ అంత కాకపోయినా, ఎంతో కొంత పంపిణీ చేసినట్లు తెలుస్తుంది. డబ్బులు ఎంత ఖర్చు పెట్టినా.. ప్రజలు తమకు నచ్చిన వారికే ఓటు వేస్తాయని పరిశీలనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు అదే విధంగా వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మంత్రి బుగ్గనను అరెస్టు చేయాలి

డోన్, మే 14: ఎన్నికల పోలింగ్‌లో స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబుపై దాడి చేసిన కేసులో మంత్రి బుగ్గనను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్‌లో అరాచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. డోన్ డీఎస్పీ, సీఐలు, పోలీసులు మంత్రికి తొత్తులుగా మారి టీడీపీకి వ్యతిరేకంగా పని చేయడం దారుణమన్నారు. దళితుడైన రిటైర్డు అడిషనల్ ఎస్పీ పీఎస్ బాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని, బేతంచెర్లలో పోలింగ్ కేంద్రం వద్దకు వెళితే.. మంత్రితోపాటు ఆయన అనుచరులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఐదేళ్లపాటు మంత్రి బుగ్గన, ఆయన అనుచరులు అరాచకాలు చేస్తూ ప్రజలను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మంత్రి బుగ్గనను ఓడించారని, డోన్‌లో తన విజయానికి ప్రజల ఆశీస్సులు అందించారన్నారు. తాము అధికారంలోకి రాగానే డోన్‌లో గంజాయి, మట్కాను పూర్తిగా లేకుండా చేస్తామని కోట్ల ప్రకటించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, తూర్పు లింగారెడ్డి, ఓబులాపురం శేషిఒరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్, చంద్రకళాచారి, నాయకులు బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



డోన్‌లో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

కర్నూలు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా నమోదైన ఓటింగ్ శాతం వివరాలు

కర్నూలు(కలెక్టరేట్), మే 14: కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం వారిగా :

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య				పోలైన ఓటర్ల సంఖ్య				
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
137- కర్నూలు	132769	141665	31	274465	86250	86715	08	174973	63.75
142-పత్తికొండ	111603	111978	22	223603	96330	93668	11	190009	84.98
143-కోడుమూరు-ఎస్సీ	123468	123148	16	246632	98880	96293	07	195180	79.14
144-ఎమ్మిగనూరు	122041	125664	47	247752	101914	101153	19	203086	81.97
145-మంత్రాలయం	102155	106172	23	208350	87808	87848	11	175667	84.31
146-ఆదోని	130364	132642	52	263058	87949	87096	19	175064	66.55
147-ఆలూరు	130083	128861	53	258997	106995	102075	22	209092	80.73
మొత్తం	852483	870130	244	1722857	666126	656848	97	1323071	76.80

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వారిగా

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య				పోలైన ఓటర్ల సంఖ్య				
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
137- కర్నూలు	132769	141665	31	274465	86250	88715	08	174973	63.75
138-పాణ్యం	161311	170321	74	331706	121952	124945	38	246935	74.44
142-పత్తికొండ	111603	111978	22	223603	96330	93668	11	190009	84.98
143-కోడుమూరు-ఎస్సీ	123468	123148	16	246632	98881	96293	07	195181	79.14
144-ఎమ్మిగనూరు	122041	125664	47	247752	101914	101153	19	203086	81.97
145-మంత్రాలయం	102155	106172	23	208350	87808	87848	11	175667	84.31
146-ఆదోని	130364	132642	52	263058	87949	87096	19	175064	66.55
147-ఆలూరు	130083	128861	53	258997	106995	102075	22	209092	80.73
మొత్తం	1013794	1040451	318	2054563	788079	781793	135	1570007	76.42

కుటుంబ సభ్యులతో సరదాగా..



కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడుపుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

ఆత్మకూరు, మే 14: మొన్నటి వరకు ఎన్నికల హడావిడితో విశ్రాంతి లేకుండా గడిపిన శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలోని వేల్పనూరులో గల ఆయన స్వగృహంలో తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఎన్నికల ప్రచారం గురించి ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. అలాగే తన అనుచరులకు కూడా చక్కటి విందు ఇచ్చారు. మంగళవారం అంతా ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే కుటుంబ సభ్యులతో గడిపారు.

ఉరుకుందలో టీజీ భరత్ పూజలు



టీజీ భరత్‌ను సన్మానిస్తున్న స్థానిక టీడీపీ నాయకులు

కౌతాళం: కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ మంగళవారం జిల్లాలోని ఉరుకుందలో పూజలు చేశారు. ఈరన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఇంటి దైవం ఈరన్న స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు మంగళవారం కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ సమీపంలో ఉన్న ఫాం హౌస్‌లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. వారితో కలసి గ్రూప్ ఫొటో దిగి ఆనందం వ్యక్తం చేశారు.




కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగుతున్న ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

ఆర్ ఖానాపురంలో ఘర్షణ .. ఒకరికి గాయాలు

గూడూరు, మే 14: గూడూరు మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో ఘర్షణ చోటుచేసుకోగా ఒకరికి గాయాలు అయ్యాయి. మంగళవారం ఆర్ ఖానాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బుల్లెట్‌పై గట్టిగా శబ్దం చేస్తూ వీధిలో తిరుగుతుండగా, దస్తగిరి అనే వ్యక్తి అభ్యంతరం చెప్పాడు. దీంతో రాఘవేంద్ర ఆగ్రహించి దస్తగిరిపై దాడి చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు దస్తగిరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ విషయం తెలుసుకున్న గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హుటాహుటిన ఆర్ ఖానాపురం గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ దస్తగిరిపై దాడికి ప్పాడిన సంఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడిన రాఘవేంద్రపై చర్యలు తీసుకుంటామన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

● పోలింగ్ సరళిపై అందరిలోనూ ఉత్కంఠ ● మెజార్టీపై లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు ● బలాలు, బలహీనతలపై బేరీజు



ఆత్మకూరు నియోజకవర్గం మ్యాప్

ఆత్మకూరు, మే 14: శ్రీశైలం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల సరళి అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లోని మొత్తం ఓటర్లు, పోలైన ఓట్ల వివరాలను తెలుసుకుని మెజార్టీపై ఎవరికి వారు లెక్కలు వేస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని నాయకులను సంప్రదిస్తూ తమ గ్రామాల్లోని ఓటరు నాడి ఏవిధంగా ఉందన్న విషయంపై ఆరా తీస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు, శ్రీశైలం మండలాల్లోని మొత్తం 226 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,96,116 మంది ఓటర్లు ఉండగా 1,62,760 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో 83.01శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో 80,355 మంది పురుషులు, 82,379 మంది మహిళా ఓటర్లతో పాటు 26 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో 80.13శాతం ఓటింగ్ జరగగా ఈసారి ఎన్నికల్లో 2.88శాతం ఓటింగ్ అధికంగా నమోదవ్వడంతో పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి ప్రయోజనం చేకూరుతోందన్న విషయం సందిగ్ధంగా మారింది. అయితే గెలుపు విషయంలో టీడీపీ, వైసీపీ నాయకులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బూత్ స్థాయిలో ఓటింగ్ వివరాలు సేకరించి తద్వారా ఏపార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కించి మెజార్టీని సైతం అంచనా వేస్తున్నారు.


నందికొట్కూరులో క్యూలో నిలిచిన ఓటర్లు (ఫైల్)


బలాలు, బలహీనతలపై నేతల మల్లగుల్లాలు

ఎట్టకేలకు సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీల నాయకులు గెలుపోటములపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆయా మండలాల్లో జరిగిన ఓటింగ్ సరళి ప్రకారం బలాలు, బలహీనతలపై అంచనా వేస్తున్నారు. ప్రత్యేకించి సున్నిపెంట, ఆత్మకూరు అర్బన్, బండిఆత్మకూరు మండలం వైసీపీకి అనుకూలంగా ఉందని ప్రచారం జరుగుతోంది. అదేక్రమంలో శ్రీశైలం, ఆత్మకూరు రూరల్, వెలుగోడు, మహానంది మండలాలు టీడీపీకి అనుకూలంగా ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పైగా ఎవరు గెలిచినా 5వేలలోపు ఓట్ల మెజార్టీ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆయా ప్రధాన పార్టీలపై తటస్థులు సైతం గంపగుత్తగా ఓట్లేస్తే మెజార్టీ 10వేల ఓట్లపైగా ఉంటుందని ఆయా పార్టీ శ్రేణులే చర్చించుకోవడం గమనార్హం. ఇదిలావుంటే పురుషుల కన్నా మహిళల ఓటింగ్ శాతం అధికంగా ఉండటంతో వారు ఎవరికి పట్టం కడతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యేకించి ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోకు ఆకర్షితులవుతారా..? లేక వైసీపీ అమలుచేసిన నవరత్నాల పథకాలకు సంతృప్తి చెందుతారా..? సందేహంగా మారింది.


ఆత్మకూరులో క్యూలో నిలిచిన ఓటర్లు (ఫైల్)

వెలుగోడు: వెలుగోడు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల గెలుపుపై ఆయా పార్టీల నాయకులు అంచనాలు వేసుకుని గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి సొంత మండలం వెలుగోడు కావడంతో ఆ పార్టీ నాయకులు గ్రామాల వారిగా ఓటర్లు, పోలైన ఓట్లు, మెజారిటీ లపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. అలాగే వైసీపీ నాయకులు సైతం పోలింగ్ అధిక శాతం పడటంతో ఓటు ఎవరికి అధికంగా పోలయ్యాయని లెక్కలు వేసుకుంటున్నారు. కాగా ఈ సారి ఎన్నికల్లో మహిళలు, యువత అధిక శాతంలో పాల్గొని తమ ఓటును వినియోగించుకోవడంతో ఆ ఓట్లు ఎవరికి పడ్డాయోనని మల్లగుల్లాలు పడుతున్నారు. మరి కొందరు గెలుపుపై బెట్టింగులకు సైతం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

నందికొట్కూరు: ఎప్పుడూ లేని విధంగా ప్రశాంత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి చిన్న అలజడి, అల్లరి లేకుండా 2024 పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. సోమవారం అర్ధరాత్రి వరకు పాములపాడు మండలం ఇస్కాల గ్రామంలో పోలింగ్ ప్రక్రియ సాగింది. అనంతరం నియోజకవర్గంలోని 251 పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను నంద్యాల ఆర్.జి.ఎం కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు అధికారులు తరలించారు. రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 2,18,047 మంది ఓటర్లు ఉండగా 1,84,888 ఓట్లు పోలవడంతో 84.79 శాతం నమోదు అయ్యింది. ఇందులో అత్యధికంగా జూపాడు బంగ్లా మండలంలో 86.47 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా పాములపాడు మండలంలో 83.47 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2019లో నందికొట్కూరు నియోజకవర్గంలో 86.92 శాతం నమోదు కాగా... ఈ సారి 84.79 శాతం నమోదు కాగా... దీంతో గతంలో కంటే 2.13 శాతం పోలింగ్ తగ్గింది.


నందికొట్కూరు నియోజకవర్గం మ్యాప్

విజయం మాదంటే.. మాదే

నందికొట్కూరులో విజయంపై వైసీపీ, టీడీపీలు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ స్టేషన్ల వారిగా ఎవరి లెక్కలు వారు వేస్తూ... విజయం తమదంటే తమదంటూ చెబుతున్నారు. సంక్షేమం చేశాం కబట్టి ఓటర్లు మాకే మళ్లీ పట్టం కడతారని వైసీపీ చెబుతుంటే... సూపర్ సిక్స్ పథకాలు, ఎమ్మెల్యే అభ్యర్థి స్థానికుడు కావడంతో విజయం తమదేనని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం నియోజకవర్గంలో మండలాల వారిగా పోలింగ్ వివరాలు:

మండలాలు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1. ఆత్మకూరు	63173	52539	83.16%
2. బండిఆత్మకూరు	37974	33873	89.20%
3. మహానంది	29760	25603	86.03%
4. శ్రీశైలం	22865	16396	71.70%
5. వెలుగోడు	42344	34385	81.20%
మొత్తం :	1,96,116	1,62,796	83.01%

నందికొట్కూరు నియోజకవర్గంలో మండలాల వారిగా పోలింగ్ వివరాలు:

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
కొత్తపల్లి	10,741	10,695	1	21437	84.13
పాములపాడు	14,111	14,339	2	28,452	83.47
జూపాడుబంగ్లా	12,930	13,055	0	25,985	86.47
మిడ్తూరు	15,354	15,173	1	30,528	84.25
పగిడ్యాల	11,346	11,633	0	22,979	84.91
నందికొట్కూరు	27,452	28,051	8	55,511	85.23
మొత్తం	91,934	92,940	12	1,84,888	84.79

నందిపల్లిలో వికసించిన క్యాక్టస్ పుష్పం



మహానంది, మే 14: మహానంది మండలం నందిపల్లి గ్రామానికి చెందిన సోమన్న అనే రైతు ఇంటి పెరట్లో క్యాక్టస్ పువ్వు పూసింది. ప్రతి ఏడాది మే నెలలో తొలకరి జల్లులు కురిసినప్పుడు మాత్రమే ఇది వికసిస్తుంది. పచ్చని దుంపల మధ్య రోజుకు ఒక పుష్పం మాత్రమే ఇది పూస్తుంది. తాను మూడు సంవత్సరాల క్రితం డిల్లీకి వెళ్ళినప్పుడు క్యాక్టస్ దుంపలు తీసుకొని వచ్చి తన ఇంటి పెరట్లో నాటినట్లు రైతు తెలిపారు. సేంద్రియ పద్ధతి ద్వారా ఈ దుంపలను పెంచుతున్నట్లు రైతు సోమన్న చెప్పారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


నాగేశ్వరరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాండ్ర

పాములపాడు, మే 14: మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఏరువ నాగేశ్వరరెడ్డి (82) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. నాయకుడి మృతదేహానికి పూలమాల వేసి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లయ్య, రమేశ్, వెంకటేశ్వర్లు నాగలక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాము, ఈశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవింద్, హరినాథ్‌రెడ్డి, బాబురెడ్డి, ప్రసాద్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనికి వెళ్లి వృద్ధురాలి మృతి

పాణ్యం, మే 14: మండలంలోని కొనిదేడు గ్రామానికి చెందిన వృద్ధురాలు గండికోట సుబ్బమ్మ (68) ఉపాధి పనికి వెళ్లి అధిక రక్తపోటుకు గురై మరణించినట్లు ఏపీవో విజయరాణి తెలిపారు. మంగళవారం ఆమె పనికి వెళ్లిన అనంతరం పని చేస్తూ కుప్పకూలారని చెప్పారు. వెంటనే పాణ్యం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాగా ఉపాధి పనులకు వృద్ధులను ఎలా పంపించారని ప్రశ్నించగా 60 యేళ్ల దాటిన వారిని ఉపాధి హామీ పథకం నుంచి తొలగించాలని కిందిస్థాయి సిబ్బందికి సూచించామన్నారు. ఈ సంఘటనతో మండలంలో 60 ఏళ్ల దాటిన వృద్ధుల జాబ్ కార్డు రద్దు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నందికొట్కూరు, మే 14: ఓ యువకుడు రోడ్డు దాటుతుండగా.. ద్విచక్రవాహనం ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన నందికొట్కూరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన మహ్మద్ రఫి కుమారుడు హారీఫ్ (18) సోమవారం రాత్రి పట్టణంలో పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. అటుగా వస్తున్న కొణిదేల శ్రీనివాసులు ద్విచక్రవాహనం ఢీ కొనడంతో హరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అల్లూరులో నాయకులు


ఉమాదేవిని కలిసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు


జయసూర్యకు పోలింగ్ సరళిని వివరిస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, మే 14: పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య మంగళవారం ఎన్నికల టెక్షన్ తగ్గింది. మిడ్తూరు, పాములపాడు మండలాల్లో టీడీపీకి చెందిన నాయకుడు మృతి చెందడంతో ఉదయాన్నే వారికి సంతాపం తెలిపేందుకు బయలుదేరి వెళ్లారు. అనంతరం 11 గంటల ప్రాంతంలో అల్లూరులోని మాండ్ర శివానందరెడ్డి నివాసానికి చేరుకున్నారు. అదే సమయంలో ఇంటి వద్దకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు వారి వారి పరిధిల్లోని జరిగిన పోలింగ్ సరళిని వివరిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ, మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి, గిత్తా జయసూర్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఫోన్ ద్వారా టీడీపీ నాయకులు జయసూర్యకు శుభాకాంక్షలు తెలిపారు.

గుడిసె దగ్ధం


ఎర్రగూడూరులో కాలిపోతున్న గుడిసె

పాములపాడు, మే 14: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో నాగేషులుకు చెందిన గుడిసె అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో గుడిసెలో మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు ఇంట్లో సామాన్లు, బట్టలు, బియ్యం వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పాణ్యం, మే 14: పాణ్యంలోని బీసీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ ఇస్మాయిల్ (70) కుటుంబానికి టీడీపీ నాయకుడు సుభాన్ రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. సోమవారం అనారోగ్యంతో ఉన్నా ఆటోలో వెళ్లి ఓటు వేశారని చెప్పారు. షేక్ ఇస్మాయిల్ భార్య షేక్ ముంతాజ్‌బీకి నగదును అందజేశారు. ఇస్మాయిల్ కుటుంబం ఇప్పటి వరకు గుడిసెలోనే జీవనం సాగిస్తున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే ఇల్లు మంజూరు చేసేలా కృషి చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు రామ్మోహన్‌నాయుడు, నాగేషులు, సుబ్బయ్య, టైలర్ శేషు, సుధాకర్, ప్రభాకర్, జయుడు, ఇర్ఫాన్, కుమార్‌రెడ్డి, శీను తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు


పూజలందుకుంటున్న నందీశ్వరస్వామి

శ్రీశైలం, మే 14: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

అలరించిన బుర్రకథ

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన వి. లక్ష్మి బుర్రకథ బృందంచే పార్వతీకల్యాణంపై బుర్రకథ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

దంచికొట్టిన వర్షం

ఆత్మకూరు, మే 14: ఆత్మకూరు పట్టణంలో సోమవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా వాతావరణం చల్లబడటం తోపాటు ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో పట్టణంలోని పలు కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. అదేవిధంగా పట్టణ శివార్లలోని పంట పొలాల్లో పెనుగాలుల బీభత్సానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇదిలావుంటే గాలుల తీవ్రత అధికంగా ఉండటంతో ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదిలావుంటే మే నెలలో ఎండలు తీవ్రంగా ఉంటాయని ప్రజలు భావించినప్పటికీ వారం రోజులుగా వాతావరణం చల్లబడటమే కాకుండా మూడు సార్లు భారీ వర్షాలు కురవడంతో ఇక్కడి ప్రజలు ఉపశమనం పొందారు.


విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభం

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

ఆత్మకూరు, మే 14: ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబానగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయ ఏకదిశంతి (21వ)వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ, వాస్తు, కలశారాధన, మూలమంత్రజపం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మూలవిరాట్‌కు అష్టోత్తర కలశాభిషేకం, సుదర్శన హోమం, కుబేర పాశుపత మూలమంత్ర హోమం చేశారు. అంతేకాకుండా మధ్యాహ్నం పూర్ణాహుతి, మధ్యాహ్న హారతి వంటి పూజాక్రతువులు చేపట్టారు. వేడుకల సందర్భంగా సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక అలంకణ చేశారు. అలాగే దిగువ ఆలయంలో ఉన్న బాబావిగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సాయంత్రం 6.15 గంటలకు సంధ్యాహారతి, ప్రాకారోత్సవం, శేజాహారతి, వేదస్వస్తి క్రతువులను సంప్రదాయబద్ధంగా చేపట్టారు. కాగా ఈ వేడుకలకు విచ్చేసిన భక్తాదులందరికీ ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. వార్షిక వేడుకలను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి: ఈవో


రోడ్డును పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 14: శ్రీశైలం దేవస్థానంలో పలు రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈవో డి. పెద్దిరాజు క్షేత్రపరిధిలోని రద్దీగా ఉండే రహదారులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వాహనాల ద్వారా విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోందని, ఈ నేపథ్యంలో క్షేత్రంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని అన్నారు. ఆలయానికి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేసుకుని, దర్శనానంతరం క్షేత్రం వెలుపలికి వెళ్లే విధంగా రూట్ డైవర్షన్స్, టెంపుల్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు అధికంగా సంచరించే ప్రదేశాలలో ఎటువంటి వాహనాలను అనుమతించకూడదని సిబ్బందికి సూచించారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం చుట్టూ స్వల్ప విస్తీర్ణంలో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. భక్తులు సంచరించే ప్రదదేశాలలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దృఢమైన రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మురళీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు: ఎస్పీ

నంద్యాల క్రైం, మే 14: పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, అక్కడ సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కేంద్ర సాయుధ బలగాలతోపాటు స్ట్రాంగ్‌రూమ్‌ల పరిసర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు స్థానిక పోలీసులతో కూడా పహారా కట్టుదిట్టం చేశామని తెలిపారు. ఈవీఎంలను భద్రపరచిన టెక్కె మార్కెట్ యార్డుతోపాటు శాంతిరామ్ కళాశాలల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో భద్రతా చర్యలు చేపట్టి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు అధికారులు ఎవరైనా వెళ్లాలనుకుంటే సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరి అని, అలాగే ఆయా అధికారుల గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా భద్రతా సిబ్బందికి చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఒట్టిపోయిన చెరువులు

● వాగులు, వంకల్లోనూ కనిపించని నీరు ● తాగు, సాగునీటి కష్టాలు ● అల్లాడుతున్న మూగజీవాలు



ముత్యాలపాడులో ఒట్టిపోయిన చెరువు



కలుగొట్లపల్లెలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

చాగలమర్రి, మే 14: మండలంలోని ముత్యాలపాడు, డి.వనిపెంట, చింతలచెరువు, చిన్నబోదనం గ్రామాల సమీపంలోగల చెరువుల్లో నీరు లేక ఒట్టిపోయింది. నీరు లేక పోవడంతో రైతులు, మూగ జీవాలు, కూలీలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ముందే నీరు లేక పోవడంతో చెరువు పరిసర గ్రామాల ప్రజలు తాగు, సాగు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. చెరువులకు నీరు విడుదల చేసి నీటి కష్టాలు తొలగించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నీటి కోసం తల్లడిల్లుతున్న మూగ జీవాలు

నీటి కోసం మూగ జీవాలు అలమటిస్తున్నాయి. పాడి పశువులు దాహం తీర్చుకునేందుకు వాగులు, వంకలు, వక్కిలేరు, కుందూ అడుగంటి పోయాయి. దీంతో నీటి కోసం మూగ జీవాలు తపిస్తున్నాయి. మండుటెండలోనే నీటి కోసం పడిగాపులు కాస్తున్నాయి. వాటి దాహం తీర్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాటర్ షెడ్ పథకం కింద మండలంలోని ముత్యాలపాడు, బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, చిన్నబోదనం గ్రామాల్లో నీటి తొట్లను ఏర్పాటు చేశారు. రూ.23 లక్షలతో నీటి తొట్లను నిర్మించారు. ఉపాధిహామీ పథకం కింద రూ.1.84 లక్షలు ఖర్చు చేశారు. నీటి తొట్లకు నీరు నింపకుండా వదిలేశారు. కొన్ని చోట్ల నీటి తొట్లను తొలగించారు. మరి కొన్ని చోట్ల నిరుపయోగంగా మారాయి. ఒక వైపు పశుగ్రాసం కొరత, మరోవైపు నీటి కొరత వేధిస్తోంది. కొందరు రైతులు కబేళాకు తరలిస్తున్నారు. నీటి సమస్య తీర్చాలని అనేక సార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మూగ జీవాలకు దప్పిక తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలుగొట్లపల్లె సమీపంలో మురుగు నీరు తాగుతున్న గొర్రెలు

కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటా

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, మే 14: డోన్ నియోజకవర్గంలో ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారంఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద ప్రజలు బారులు తీరి నిలబడి ఉత్సాహంగా ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగించారన్నారు. ఓటు వేయాలన్న ఆసక్తితో పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండటం ప్రజాచైతన్యానికి నిదర్శనమపి అన్నారు. డోన్ నియోజకవర్గంలో ఐదేళ్లుగా విధ్వంస పాలనను ఎదుర్కొని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి: అఖిలప్రియ

నంద్యాల, మే 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలని టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అఖిలప్రియ, భార్గవ్‌రామ్ నాయుడు సూచించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటు వేయ డానికి వెళ్లి అకస్మాత్తుగా చనిపోయిన టీడీపీ కార్యకర్త వలి కుటుంబాన్ని మంగళవారం వారు శిరివెళ్లలో పరామర్శించారు. ఎన్నికల పోలింగ్‌లో తెలిసో, తెలియకో జరిగిన ఘటనలను మనసులో పెట్టుకోవద్దని సూచించారు.ఎన్నికల్లో పాల్గొన్న మూడు పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు వారు అభినందనలు తెలిపారు.

పాల ప్యాకెట్లు పడేశారు



ముకుందాపురం సమీపంలో పడేసిన అంగన్‌వాడీ పాల ప్యాకెట్లు

రుద్రవరం, మే 14: మండలంలోని ముకుందాపురం గ్రామ సమీపంలో అంగన్ వాడీ పాలప్యాకెట్లు చెడిపోవడంతో గ్రామ సమీపంలో కాలువలో పడేశారు. సుమారు 50 పాల ప్యాకెట్లు ఇక్కడ పడేశారు. పిల్లలకు అందే పాలప్యాకెట్లు చెడిపోవడంతో వారికి పాలు అందలేదు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిని వివరణ కోరగా విచారిస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, మే 14: మండలంలోని బలపాలపల్లి గ్రామానికి చెందిన బెల్లం నారాయణరెడ్డి (40) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వివరాలివీ.. నారాయణ రెడ్డి సోమవారం సాయంత్రం పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. సాయంత్రం వడగండ్ల వానతో ఈదురుగాలులు, వర్షం భారీగా పడటంతో ఒక చెట్టు కిందకు వెళ్లారు. అయితే చెట్టుకొమ్మ గాలికి విరిగి అతనిపై పడటంతో అక్కడ ఉన్న కొంత మంది గమనించి అతనిపై పడిన కొమ్మను తొలగించి తీవ్రగాయాలైన నారాయణరెడ్డిని చికిత్స నిమిత్తం బేతంచెర్ల ఆసుపత్రికి తరలించగా.. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందారు. నారాయణరెడ్డికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కొలిమిగుండ్ల రూరల్, మే 14: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన విషాదకర ఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలివీ.. గ్రామంలోని ప్రధాన రహదారి సమీపంలో గంగమ్మ గుడి వద్ద మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన పార్వతమ్మకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

22 నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రుద్రవరం, మే 14: రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ఈ నెల 22 నుంచి 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. సంబంధిత దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు. గత నెల నుంచి అప్లికేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పదో తరగతిలో సాధించిన మార్కులు మెరిట్ రిజర్వేషన్ల నిబంధనల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో మాత్రమే బోధన ఉంటుందన్నారు. ఎలాంటి ఫీజుల చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఓబీసీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

పోలింగ్ ప్రశాంతతపై హర్షం

డోన్(రూరల్), మే 14: డోన్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడంపై జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం కూడా పెరిగిందన్నారు. ఓటర్లు చైతన్యవంతులై తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి గంటల తరబడి పోలింగ్ బూతుల వద్ద ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఎన్నికలు, పోలీసు అధికారుల సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు.

ఉపాధి పనికి వెళ్లి వృద్ధురాలి మృతి

పాణ్యం, మే 14: మండలంలోని కొనిదేడు గ్రామానికి చెందిన వృద్ధురాలు గండికోట సుబ్బమ్మ (68) ఉపాధి పనికి వెళ్లి అధిక రక్తపోటుకు గురై మరణించినట్లు ఏపీవో విజయరాణి తెలిపారు. మంగళవారం ఆమె పనికి వెళ్లిన అనంతరం పని చేస్తూ కుప్పకూలారని చెప్పారు. వెంటనే పాణ్యం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాగా ఉపాధి పనులకు వృద్ధులను ఎలా పంపించారని ప్రశ్నించగా 60 యేళ్లు దాటిన వారిని ఉపాధి హామీ పథకం నుంచి తొలగించాలని కిందిస్థాయి సిబ్బందికి సూచించామన్నారు. ఈ సంఘటనతో మండలంలో 60 ఏళ్లు దాటిన వృద్ధుల జాబ్ కార్డు రద్దు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నందికొట్కూరు, మే 14: ఓ యువకుడు రోడ్డు దాటుతుండగా.. ద్విచక్రవాహనం ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన నందికొట్కూరు పట్టణం లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన మహ్మద్ రఫీ కుమారుడు హరీఫ్ (18) సోమవారం రాత్రి పట్టణంలో పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. ఆటుగా వస్తున్న కొణిదేల శ్రీనివాసులు ద్విచక్రవాహనం ఢీ కొనడంతో హరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కృషి: కోట్ల



బేతంచెర్లలో మాట్లాడుతున్న కోట్ల

బేతంచెర్ల, మే 14: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మీ అధ్యక్షతన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కోట్ల మాట్లాడుతూ గంజాయి, మట్కా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు తమ తీర్పును ఇచ్చేందుకు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటును వినియోగించుకోవడం హర్షణీయమన్నారు. టీడీపీ అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు పార్టీలకతీతంగా ప్రజలకు అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి రిటైర్డు అడిషినల్ ఎస్పీ పీఎన్ బాబు కారు అద్దాలను అధికార పార్టీ మంత్రి బుగ్గన వర్గీయులు ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి తమ నాన్న విజయానికి కృషి చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఎల్ల నాగయ్య, షేక్షావలి చౌదరి, పోలూరు రాఘవరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విదంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రావడం ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, తిరుమలేష్ చౌదరి, బుగ్గన మాధవి రెడ్డి, కోట్ల గిరిధర్ రెడ్డి, శివ, జావాజి వెంకటేశ్వర్లు, నాగరాజు, రూబెన్ పాల్గొన్నారు.

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల స్పందనతో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ కేంద్ర మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవాకం పట్టణంలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కోట్ల మాట్లాడుతూ ఎన్నికల్లో అధికారపార్టీ నేతలు ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన ధైర్యంగా ఎదుర్కొన్నామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకులు పోలీసులతో దాడులు చేయించారని ఆరోపించారు. అయినా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడకుండా ఎన్నికలను సక్రమంగా జరుపుకున్నారన్నారు. ఎవరు ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన భయపడవద్దని, అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావుయాదవ్, టి శ్రీనివాసులు, ఆర్ఈ నాగరాజు, రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, రాజా నారాయణమూర్తి, చల్లా వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు బీసీ అభినందనలు



టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బీసీ



కార్యకర్తలతో బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 14: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగడంతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ శాతం అధికంగా నమోదు అయ్యేలా కృషి చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంగళవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం జరిగిన ఎన్నికల సరళిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు సంబంధించిన నాయకులు, ఏజెంట్లతో ప్రత్యేకంగా మాట్లాడి టీడీపీకి పోలైన ఓటింగ్ శాతం గురించి ఆరా తీశారు. ఎన్నికల సందర్భంగా తన వెన్నంటే ఉండి తన విజయం కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్న టీడీపీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

'నాయకులు, కార్యకర్తల మద్దతు మరచిపోలేనిది'

రెండు నెలలుగా ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు తన వెన్నంటి వుండి అందిస్తున్న మద్దతు మరిచి పోలేనిదని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పోలింగ్ పూర్తయిన సందర్భంగా మంగళవారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో ఎంతో కష్టపడి పనిచేశారని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కుటుంబం కార్యకర్తలను ఎప్పటికీ మరువదని, ఎన్నికల నేపథ్యంలో ఇబ్బందుల ఎదుర్కొన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. పోలింగ్ రోజు కష్టపడి పనిచేసి, ఓటర్లను పెద్ద ఎత్తున పోలింగ్ పోలింగ్ కేంద్రాలకు రప్పించిన ఘనత కార్యకర్తలదేనన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, బాలిరెడ్డి, శివారెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, కృష్ణరంగారెడ్డి, భాస్కరరెడ్డి, ప్రసాద్, చిన్నపురెడ్డి, నరసింహుడు, చంద్రశేఖర్, శివ, సీతారామయ్య, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పోటెత్తిన ఓటర్లు

డోన్, మే 14: డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో తుది ఎన్నికల పోలింగ్ నమోదు శాతాన్ని మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి అధికారికంగా ప్రకటించారు. డోన్ నియోజకవర్గంలో మొత్తం 82.77 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 2,27,351 మందికి గానూ 1,88,187 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 93,766 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 94,387 మంది ఉన్నారు. ఇతరులు 34 మంది ఉన్నారు. డోన్ నియోజకవర్గంలో అత్యధికంగా 224 పోలింగ్ బూత్‌లో పోలింగ్ నమోదైంది. నాగమల్లకుంట పోలింగ్ బూత్‌కు సంబంధించి 405 మంది ఓటర్లు ఉండగా.. 396మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా 97.78 శాతం పోలింగ్ నమోదైంది. డోన్ అర్బన్‌లోని 133వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది. ఆ పోలింగ్ కేంద్రంలో 1110 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 542 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 48.83 శాతంతో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది.

గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పోలింగ్

డోన్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పోలింగ్ శాతం నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంత పెద్ద ఎత్తున పోలింగ్ శాతం పెరగడం ఇదే ప్రథమమని చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరగడంపై టీడీపీ నాయకులు తమకు అనుకూలమన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

శిరివెళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 295 ఎన్నికల కేంద్రాల్లో జరిగిన పోలింగ్‌లో ఓటర్లు పోటెత్తారు. నియోజకవర్గంలో 2,32,676 మందికి గాను 1,95,236 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 83.91 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో దొర్నిపాడు మండలంలో 20,287 మందికి గాను 17,211 మంది ఓటు వేయగా 84.84 శాతం, ఉయ్యాలవాడ మండలంలో 22,858 మందికి గాను 19,217 మంది ఓటు వేయగా 84.07 పోలింగ్ శాతం నమోదైంది. శిరివెళ్ల మండలంలో 47,412 మందికి గాను 39,225 మంది ఓటు వేయగా 82.73 శాతం, ఆళ్లగడ్డ మండలంలో 63,698 మందికి గాను 53,094 మంది ఓటు వేయగా 83.35 పోలింగ్ శాతం నమోదైంది. అలాగే రుద్రవరం మండలంలో 37,656 మందికి గాను 32,616 మంది ఓటు వేయగా 86.62 శాతం, చాగలమర్రి మండలంలో 40,765 మందికి గాను 33,873 మంది ఓటు వేయగా 83.09 పోలింగ్ శాతం నమోదైంది.

బనగానపల్లె: 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బనగానపల్లె నియోజకవర్గంలో 84.06 పోలింగ్ శాతం నమోదు అయినట్లు ఆర్వో కామేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నియోజకర్గంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పారు.

రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి: ఈవో



రోడ్డును పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 14: శ్రీశైలం దేవస్థానంలో పలు రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈవో డి. పెద్దిరాజు క్షేత్రపరిధిలోని రద్దీగా ఉండే రహదారులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వాహనాల ద్వారా విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోందని, ఈ నేపథ్యంలో క్షేత్రంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని అన్నారు. ఆలయానికి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేసుకుని, దర్శనానంతరం క్షేత్రం వెలుపలికి వెళ్లే విధంగా రూట్ డైవర్షన్స్, టెంపుల్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు అధికంగా సంచరించే ప్రదేశాలలో ఎటువంటి వాహనాలను అనుమతించకూడదని సిబ్బందికి సూచించారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం చుట్టూ స్వల్ప విస్తీర్ణంలో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. భక్తులు సంచరించే ప్రదదేశాలలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దృఢమైన రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మురళీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు పారేదెలా?



రాళ్లతో నిండిన తెలుగుగంగ ప్రధాన కాలువ

రుద్రవరం, మే 14: తెలుగుగంగ ప్రధాన కాలువ రుద్రవరం సమీపంలో రాళ్లు నిండి 22వ బ్లాక్ ఛానెల్ తూము వద్ద రాళ్లు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. నీటి ప్రవాహానికి ఈ కుప్పలు అడ్డంకిగా మారాయి. కాలువలు ఇలా ఉంటే నీరు ఎలా పారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కాల్వ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా తయారైంది.

ఘనంగా భగీరథ జయంతి



పూజలు చేస్తున్న సగర సేవా సంఘం సభ్యులు

బనగానపల్లె, మే 14: బనగానపల్లె పట్టణంలో సగరసేవా (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భగీరథ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ సమీపంలో భగీరథ విగ్రహానికి సంఘం అధ్యక్షులు బుర్రా వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు పూలమాల వేసి పూజలు చేశారు. సగరులంతా ఐక్యంగా ఉండి అన్ని విధాలుగా అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, కృష్ణ, చెన్నయ్య, సురేష్, లక్ష్మీనారాయణ, అంగడి కృష్ణ, దస్తగిరి, శ్రీరాములు, పుల్లయ్య, చెంచయ్య పాల్గొన్నారు.

ఆది శంకరాచార్యుల జయంతి

చాగలమర్రి, మే 14: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమం, కోదండ రామాలయాల్లో ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు చేశారు. కోదండ రామాలయంలో మహిళలు దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

చెరువులకు చేరిన వర్షం నీరు



ఆలమూరు చీలబోయిన చెరువులో చేరిన వర్షం నీరు

రుద్రవరం, మే 14: రుద్రవరం మండలంలో నిన్న మొన కురిసిన వర్షాలకు చెరువులకు వర్షం నీరు చేరింది. నీరు లేక చెరువులు మొన్నటి వరకు వెలవెలబోయాయి. వర్షం కురియడంతో వర్షం నీరు చెరువులకు స్వల్పంగా చేరింది. గుంతల్లో వర్షం నీరు నిల్వ చేరడంతో పశువలకు తాగేందుకు సౌకర్యంగా ఉంది, నీరు లేక చెరువులు వెల వెలబోయి ఒట్టిపోయి ఉండేవి. ఇందులో భాగంగా రుద్రవరం మండలం ఆలమూరు చీలబోయిన చెరువుకు, రుద్రవరం కొండమాయపల్లె చెరువుకు వర్షంనీరు చేరింది. కాల్వలు గుంటల్లో అక్కడక్కడా స్వల్పంగా వర్షం నీరు చేరింది.

రోడ్డుపై మురుగు నిల్వ



లింగాలలో ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు

కోవెలకుంట్ల, మే 14: మండలంలోని లింగాల గ్రామంలో నడిరోడ్డుపైన మురుగు నిల్వ ఉండడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగాల నుంచి వల్లంపాడు, గుండుపాపలకు వెళ్లే ప్రధానరహదారిలో ఈమురుగునీరు నిల్వ ఉండడంతో ఈరహదారి వెంట నడిచి వేళ్లేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న నందీశ్వరస్వామి

శ్రీశైలం, మే 14: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

అలరించిన బుర్రకథ

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన వి. లక్ష్మి బుర్రకథ బృందంచే పార్వతీకల్యాణంపై బుర్రకథ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.